సాక్షి సిద్దిపేట

శనివారం । 9 । సెప్టెంబర్ । 2023

న్యూస్‌రీల్

మత్స్యకారుల అభివృద్ధికి ప్రాధాన్యం

రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ ఛైర్మన్ పిట్టల రవీందర్



మాట్లాడుతున్న పిట్టల రవీందర్

దుబ్బాకటౌన్: మత్స్యకారుల కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి పర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పెద్దమ్మ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముదిరాజు కులస్తుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. రాష్ట్రంలో మత్స్యసంపదను పెంపొందించి దీనిపై ఆధారపడిన కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మత్స్య సహకార సంఘాలను పటిష్ట పరిచి అందరికీ న్యాయం జరిగేలా ఫెడరేషన్ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నామన్నారు. దుబ్బాక పట్టణంలో ముదిరాజు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మరో రూ. 50 లక్షలు మంజూరు చేయించాలని ముదిరాజు కుల పెద్దలు రవీందర్‌ను కోరారు. దీంతో స్పందించిన ఆయన తప్పకుండా నిధులు మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ముదిరాజు సంఘం అధ్యక్షుడు మాడవైన రాజు, నాయకులు తదితరులు ఉన్నారు.

ఓటరు దరఖాస్తులను పరిశీలించండి

అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్




మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

సిద్దిపేట రూరల్: ఓటరు నమోదుకు చేసుకున్న దరఖాస్తులను సత్వరం పరిశీలించాలని అదనపు కలెక్టర్, దుబ్బాక శాసనసభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి గరిమా అగర్వాల్ తాహసీల్దార్లకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని మండలాల తహసీల్దార్లు, కంప్యూటర్ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటు హక్కు కోసం చేసుకున్న దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పరిశీలించాలన్నారు. ఈ మేరకు సోమవారం నుంచి బూత్ లేవెల్ ఆఫీసర్ల ద్వారా ఇంటింటి పరిశీలన పూర్తి చేయించాలన్నారు. దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలించి వివరాలను పొందుపరచాలని అన్నారు.

వర్షపు నీరు నిల్వకుండా చూడాలి

రేగోడ్(మెదక్): పంటలో నిలిచిన వర్షపు నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ అన్నారు. మండలంలోని కొండాపూర్ గ్రామంలో పత్తి పంటను శుక్రవారం పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు చేశారు. నీటిని బయటకు పోయేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. మొక్కలు వడలిపోతే లీటర్ నీటికి 3గ్రాముల చొప్పున కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను కలిపి మొక్క అడుగు భాగం తడిసే విధంగా 5 నుంచి 7 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేసుకోవాలన్నారు. పంట ఎదుగుదలకు లీటర్ నీటికి 10 గ్రాముల మల్టికె లేదా 19:19:19 వంటి పోషకాలను చల్లుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జావిద్, ఏఈఓ వినిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో సునీతారెడ్డి



పూజలు చేస్తున్న సునీతారెడ్డి

పాపన్నపేట(మెదక్): రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి శుక్రవారం ఏడుపాయల దుర్గమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పూజారులు రాజశేఖర శర్మ ప్రత్యేక పూజలు చేసి ఆమెకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ సిబ్బంది శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు.

కాలువల్లో గోదావరి గలగలలు



తెరుచుకున్న రిజర్వాయర్ కుడి కాలువ షెట్టర్

- గౌరవెల్లి కుడి, ఎడమ కాలువల్లో పరుగులు
- ఆనందంలో రైతులు
- షెట్టర్లను పరిశీలించిన అధికారులు

అక్కన్నపేట(హుస్నాబాద్): గుడాటిపల్లి వద్ద నిర్మించిన గౌరవెల్లి రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువ షెట్టర్లను శుక్రవారం కొంతసేపు తెరిచారు. దీంతో రిజర్వాయర్‌లో ఉన్న గోదావరి జలాలు ఒక్కసారిగా పరుగులు పెట్టాయి. కాలువ నిండుగా నీళ్ల పరుగులు పెట్టడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. కాలువ షెట్టర్ల పని తీరు తెలుసుకునేందుకు హైదరాబాద్ నుంచి సంబంధించిన టెక్నికల్ అధికారులు వచ్చి వాటిని పరిశీలించనట్లు తెలిసింది. కొద్దిసేపు తర్వాత కాలువల షెట్టర్లను మూసేశారు. రిజర్వాయర్‌లో దాదాపు 0.06టీఎంసీల నీరు నిల్వ ఉండటంతో షెట్టర్లను పరిశీలించేందుకు తీసిన సమయంలో కాలువలో గోదావరి నీళ్ల పరవళ్ల తొక్కింది.

బొడ్రాయి సంబురం



గాగ్గిళ్లాపూర్‌లో వైభవంగా ప్రతిష్ఠాపనోత్సవాలు

మద్దూరు మండలం గాగ్గిళ్లాపూర్‌లో బొడ్రాయి, పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. మహిళలు సామూహికంగా జల కదువలతో వచ్చి విగ్రహాలకు జలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కుల సంఘాల పెద్దలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. - మద్దూరు(హుస్నాబాద్)



బొడ్రాయికి జలాభిషేకం నిర్వహిస్తున్న మహిళలు

571 టీచర్ పోస్టులు



ఉమ్మడి మెదక్ జిల్లాలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

- ఈనెల 20 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- తొలిసారిగా ఆన్‌లైన్‌లో రాత పరీక్ష
- తక్కువ పోస్టుల భర్తీపై నిరుద్యోగుల్లో నిరాశ

సాక్షి, సిద్దిపేట: ఆరేళ్లుగా నిరుద్యోగులు ఎదురుచూస్తున్న డీఎస్సీ నోటిఫికేషన్ ఎట్టకేలకు విడుదలైంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో 571 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనున్నారు. 2017లో టీచర్స్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (టీఆర్‌టీ) పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా 8వేలకు పైగా పోస్టులు భర్తీ చేశారు. ఆ తర్వాత రిక్రూట్‌మెంట్ లేకపోవడంతో భారీ ఎత్తున పోస్టులను భర్తీ చేస్తుందన్న నమ్మకంతో చాలా మంది బీఎడ్, డీఎడ్ కోర్సులు చేశారు. ఎట్టకేలకు ఆరేళ్ల తరువాత ప్రభుత్వం డీఎస్సీ ప్రకటించింది.

జిల్లా	ఎస్ఏ	ఎల్పీలు	పీఈటీ	ఎస్‌జీటీ	మొత్తం
సిద్దిపేట	60	24	08	49	141
సంగారెడ్డి	80	24	05	174	283
మెదక్	70	28	01	48	147

ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

టీచర్ల భర్తీ కోసం ఈ నెల 20 నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించనున్నారు. దరఖాస్తు రుసుము వచ్చే నెల 20లోగా చెల్లించాలి. దరఖాస్తులు తరువాతి రోజు 21 వరకు ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవచ్చు. ఈ నెల 15న టెట్‌ను నిర్వహించనున్నారు. దీంతో ఈ ఏడాది బీఈడీ, డీఎడ్ పూర్తి చేసిన వారు సైతం డీఎస్సీకి అర్హులు కానున్నారు. తొలిసారి రాత పరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో రెండు పరీక్ష కేంద్రాలు మెదక్, సంగారెడ్డిలో ఏర్పాటు చేశారు. కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (సీబీఆర్‌టీ) నవంబర్ 20 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

నిరాశ చెందిన నిరుద్యోగులు

ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు ఎక్కువగా ఉన్నప్పటికీ తక్కువ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయడంతో నిరుద్యోగులు నిరాశ చెందారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టుల భర్తీ కోసం ఆరేళ్లుగా ఎదురుచూస్తున్న వీరికి ప్రభుత్వం నిరాశ మిగిల్చింది. ఉద్యోగం పై ఎంతగానో ఆశ పెట్టుకున్న వారు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఖాళీలన్నీ భర్తీ చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

రోడ్ల విస్తరణకు రూ.30.65 కోట్లు

ఇక రయ్‌రయ్..!

- గ్రామీణ రహదారులకు మహర్దశ
- డబుల్ లేన్లుగా మార్పు
- త్వరలోనే టెండర్ల ప్రక్రియ షురూ
- మంత్రి హరీశ్‌రావు వెల్లడి





ఇబ్రహీంనగర్‌లో బ్రిడ్జి నిర్మించనున్న ప్రాంతం

సిద్దిపేటఅర్బన్: గ్రామీణ రహదారులు ప్రగతిబాటలుగా మారనున్నాయి. సింగిల్ లేన్ రోడ్లను డబుల్ లేన్లుగా విస్తరించేందుకు రూ.30కోట్ల65 లక్షల నిధులు మంజూరు అయినట్లు మంత్రి హరీశ్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిద్దిపేట నలుదిశలా రహదారుల అభివృద్ధి జరిగిందని, పట్టణానికి సమీపంలోని అన్ని రహదారులను నాలుగు వరుస రహదారులుగా మార్చినట్లు పేర్కొన్నారు. అదే క్రమంలో గ్రామీణ ప్రాంత రోడ్లు అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో మరో మూడు రహదారుల విస్తరణకు నిధులు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. హన్మకొండ దారిలో రాజగోపాల్‌పేట్ నుంచి గోనెపల్లి మీదుగా రాజీవ్ రహదారిపై ఇబ్రహీంనగర్ వరకు 8.3 కిలోమీటర్ల రహదారిని రెండు వరుసలుగా విస్తరించేందుకు రూ.14 కోట్ల 50 లక్షలు, సిద్దిపేట అర్బన్ మండలం కిష్టసాగర్ నుంచి సిద్దిపేట బైపాస్ రోడ్డులోని టీటీసీ భవన్ వరకు 2.2 కి.మీ. ఉన్న రోడ్డు కోసం రూ.3కోట్ల 65 లక్షలు, చిన్నకోడూర్ మండలం గంగాపూర్ గ్రామం నుంచి విఠలాపూర్ వరకు 5.8 కి.మీ.దారిని విస్తరించేందుకు రూ.12 కోట్ల 50 లక్షలు మంజూరు అయినట్లు తెలిపారు. త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఇబ్రహీంనగర్ వద్ద హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం

చిన్నకోడూర్ మండలం ఇబ్రహీంనగర్ వద్ద ఉన్న లో లెవల్ బ్రిడ్జిని హైలెవల్ బ్రిడ్జిగా మార్చనున్నట్లు పేర్కొన్నారు. వర్షాకాలం వచ్చిందంటే రాకపోకలకు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఉండేదని, రహదారి విస్తరణలో భాగంగా బ్రిడ్జి నిర్మాణ పనులు జరగనున్నట్లు తెలిపారు. హై లెవల్ బ్రిడ్జ్ నిర్మాణం కానుండడంతో ఇక నుంచి ప్రయాణం సులభతరం కానుందని పేర్కొన్నారు.

పనులు వేగిరం చేయండి

- కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్
- మహిళా సమాఖ్య, వృద్ధాశ్రమం, మహిళా ప్రాంగణం భవన నిర్మాణ పనుల పరిశీలన



అధికారులు, కాంట్రాక్టర్లతో మాట్లాడుతున్న కలెక్టర్

సిద్దిపేటఅర్బన్: జిల్లా మహిళా సమాఖ్య భవనం, వృద్ధాశ్రమం, మహిళా ప్రాంగణం భవన నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌ను కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ ఆదేశించారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎల్లుపల్లి శివారులో నిర్మిస్తున్న ఆయా భవనాలను శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రూ.4కోట్లతో నిర్మిస్తున్న జిల్లా మహిళా సమాఖ్య భవనం పనులు ప్లాస్టరింగ్ దశలో ఉన్నాయని, ఇప్పటి వరకు 70 శాతం పనులు పూర్తయ్యాయని ఇంజనీరింగ్ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. దీంతో కాంట్రాక్టర్‌ను కలెక్టర్ అభినందించారు. ప్రహరీ పనులు సైతం త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈడబ్ల్యూఐడీసీ ఇంజనీరింగ్, డీఆర్‌డీఏ, డీడబ్ల్యూవో అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో నాణ్యత పాటిస్తూ పనులు వేగంగా పూర్తి చేసి భవనాలను ప్రారంభానికి సిద్ధం చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట డీడబ్ల్యూవో రాంగోపాల్‌రెడ్డి, అదనపు డీఆర్‌డీఏ పీడీ రవీందర్, ఈడబ్ల్యూఐడీసీ డీఈ మధుసూదన్, కాంట్రాక్టర్లు ఉన్నారు.

రేపు మంత్రుల రాక

సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రంలో ఈనెల 10న రాష్ట్ర మంత్రులు హరీశ్‌రావు, శ్రీనివాస్ యాదవ్ పర్యటిస్తున్నారని, అందుకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ సూచించారు. శుక్రవారం జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి పట్టణంలో పలు ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటించారు. స్థానిక చింతల్ చెరువులో మంత్రులు చేప పిల్లలను వదిలే కార్యక్రమంలో పాల్గొననున్నారని తెలిపారు. చెరువు కట్టపై పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలన్నారు. అనంతరం పత్తి మార్కెట్ యార్డులో నిర్వహించే గంగపుత్రులకు సొసైటీ గుర్తింపు కార్డులను పంపిణీ, సభ వేదిక గురించి ఆరా తీశారు. వాహనాల పార్కింగ్, బందోబస్తు గురించి సూచనలు చేశారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్, నాయకులు రాజనర్సు, శర్మ, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'గౌరవెల్లి'ని అడ్డుకునేందుకు కుట్ర

ఎమ్మెల్యే సతీష్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

హుస్నాబాద్‌రూరల్: గౌరవెల్లి ప్రాజెక్టు పనులు ఆపేందుకే కొందరు కుట్రపన్నుతున్నారని ఎమ్మెల్యే సతీష్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లకావత్ మానస అధ్యక్షతన జరిగిన సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు ప్రాజెక్టుకు సంబంధించి హైకోర్టులో ఎలాంటి కేసులు లేవని 99శాతం ప్రాజెక్టు పనులు పూర్తి చేశామని, గ్రీన్ ట్రిబ్యునల్ కేసు పూర్తి కాగానే సీఎం కేసీఆర్ చేత ప్రారంభిస్తామన్నారు. రైతుల శ్రేయస్సు కోరుకునే నాయకులెవరూ సాగునీరు అందించే ప్రాజెక్టులను అడ్డుకోరని హితవు పలికారు. అభివృద్ధిలో హుస్నాబాద్ మండలానికి ప్రత్యేక స్థానం ఉందని, మరిన్ని నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే సతీష్ కుమార్ అన్నారు. వివిధ అంశాలపై జరిగిన చర్చలో పాల్గొని సర్పంచ్‌లు, ఎంపీటీసీలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. హుస్నాబాద్ మండలంలోకి అక్కన్నపేట మండలం నుంచి 10 గ్రామాలు త్వరలోనే చేరుతాయన్నారు. సమావేశంలో జెడ్పీ వైస్‌చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, మార్కెట్ చైరపర్సన్ రజనీతిరుపతిరెడ్డి, తహసీల్దారు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఓటుపై అవగాహన కల్పించండి

జగదేవ్‌పూర్(గజ్వేల్): త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను అదనపు డీసీపీ శ్రీనివాస్‌రావు శుక్రవారం గజ్వేల్ ఏసీపీ రమేశ్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సరఫరా, కాంపౌండ్ వాల్స్, ర్యాంప్‌లు తదితర సౌకర్యాలను పరిశీలించారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ఏర్పాట్లు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఓటు హక్కు ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని పోలీసు అధికారులకు సూచించారు. అదే విధంగా మర్కుక్ మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి, స్థానిక పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ఇంకా కార్యక్రమంలో రూరల్ సీఐ జానకీరాంరెడ్డి, ఆయా పోలీస్ స్టేషన్ల ఎస్‌ఐలు, సిబ్బంది ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని గురువన్నపేట, కొమురవెల్లి ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలతో పాటు నూతనంగా నిర్మించిన కొమురవెల్లి పోలీస్‌స్టేషన్ భవనాన్ని అదనపు డీసీపీ (అడ్మిన్) శ్రీనివాస్‌రావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి సంబంధిత గ్రామ ప్రజలు, నాయకులు సహకరించాలని సూచించారు. ఓటు విలువ, ప్రాముఖ్యతపై ప్రజలకు అవగహన కల్పించాలని పోలీసులకు సూచించారు. కార్యక్రమంలో చేర్యాల సీఐ సత్యనారయణ, ఎస్ఐ నాగరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు ఉంటే తెలపండి

మద్దూరు(హుస్నాబాద్): మద్దూరు, దూళ్మిట్ట మండలాల్లో పోలింగ్ కేంద్రాలను అదనపు డీసీపీ శ్రీనివాసురావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.



కొమురవెల్లి(సిద్దిపేట): గురువన్నపేటలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు డీసీపీ శ్రీనివాస్‌రావు

రైలు ఇక పరుగులే..!

- ఇప్పటికే మూడుసార్లు ట్రయల్ రన్ విజయవంతం
- సిద్దిపేట వరకు పూర్తి కావస్తున్న పనులు
- మనోహరాబాద్-కొత్తపల్లి రైల్వేలైన్‌పై కదలిక



మనోహరాబాద్-కొత్తపల్లి రైల్వేలైన్‌పై కమిషన్ ఆఫ్ రైల్వే సేఫ్టీ అధికారుల తనిఖీలు (ఫైల్)

గజ్వేల్: మనోహరాబాద్-కొత్తపల్లి లైన్‌పై కదలిక మొదలైంది. ఉత్తర తెలంగాణ అభివృద్ధిలో కీలకమైనదిగా చెప్పుకుంటున్న ఈ రైల్వేలైన్ పనులు పూర్తికావస్తుండగా ప్యాసింజర్ రైలు కోసం ప్రజలకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఇటీవల మంత్రి హరీశ్‌రావు దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్‌తో కలిసి ఈ అంశంపై చర్చించడం ప్రాధాన్యతను సంతరించుకున్నది. ఈ క్రమంలోనే ఎదురుచూపులకు తెరపడనుందని తెలుస్తోంది.

మనోహరాబాద్ నుంచి కొత్తపల్లి వరకు 151.36కిలోమీటర్ల పొడవున ఈ న్యూబ్రాడ్‌గేజ్ లైన్ నిర్మాణం జరుగుతుండగా.. రూ.1160.47కోట్లను వెచ్చిస్తున్నారు. 2017లో ఈ పనులు ప్రారంభమయ్యాయి. ఈ లైన్ సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి మనోహరాబాద్ మీదుగా కొత్తపల్లి వరకు, అక్కడి నుంచి పెద్దపల్లి గ్రాండ్ ట్రంక్ లైన్‌తో అనుసంధానం కానుంది. హైదరాబాద్, న్యూఢిల్లీ, కలకత్తా లాంటి మహానగరాలను కలుపుతూ జాతీయ లైన్‌గా ఆవిర్భవించనుంది. పెద్దపల్లి గ్రాండ్‌ట్రంక్‌లైన్‌కు ఇప్పటి వరకు సికింద్రాబాద్, ఖాజీపేట మార్గం అనుసంధానంగా ఉండేది. మనోహరాబాద్- కొత్తపల్లి రైల్వేలైన్ పూర్తయితే.. దూరభారం తగ్గనున్నది. మనోహరాబాద్ నుంచి గజ్వేల్ మీదుగా కొడకండ్ల వరకు 43 కిలోమీటర్ల రైల్వేలైన్ పనులు గతంలోనే పూర్తయ్యాయి. ఈ క్రమంలోనే ప్యాసింజర్ రైలు నడపడానికి ఇప్పటికే రెండు మార్లు కమిషన్ ఆఫ్ రైల్వేసేఫ్టీ ఆధ్వర్యంలో 2020 జూన్ 20న, 2022 ఫిబ్రవరి 11న తనిఖీలు కూడా పూర్తయ్యాయి. మొదటి తనిఖీ మనోహరాబాద్ నుంచి గజ్వేల్ వరకు 33 కిలోమీటర్లు, రెండో తనిఖీ గజ్వేల్ నుంచి కొడకండ్ల వరకు మరో 10 కిలోమీటర్ల వరకు కొనసాగింది. మొత్తంగా మనోహరాబాద్ నుంచి కొడకండ్ల వరకు 43కిలోమీటర్లు ప్యాసింజర్ రైలు నడపాలని అనుకున్నారు. కానీ ఇది అమలుకు నోచుకోలేదు. ఇదే క్రమంలో ఈ ఏడాది మార్చి 31న గజ్వేల్ మండలం కొడకండ్ల నుంచి 21 కిలోమీటర్ల మేర కొండపాక మండలం దుద్దెడ వరకు ట్రయల్ రన్ విజయవంతంగా జరిగిన సంగతి తెలిసిందే. ఈ లెక్కన మొత్తం లైన్ పొడవు 151.36 కిలోమీటర్లలో ఇప్పటికే 64కిలోమీటర్ల మేర రైలు నడపడానికి ట్రాక్ సిద్ధమైనట్లు అధికారుల తేల్చారు. కాగా దుద్దెడ నుంచి సిద్దిపేట వరకు సుమారుగా మరో 10కిలోమీటర్ల మేర పనులు పూర్తి కావస్తున్నాయి. ఈ లెక్కన 50శాతం వరకు పనులు పూర్తయ్యాయి.

మాల్‌గాడీకి మంచి గిరాకీ!

ఇదిలావుంటే గజ్వేల్‌వరకు గతేడాది జూన్ 27న గూడ్స్ రైలు సేవలను రేక్ పాయింట్ కోసం ప్రారంభించింది. రాబోవు రోజుల్లోనూ ఈ మార్గంగుండా దండిగా ఆదాయం రానున్నదని భావించిన రైల్వేశాఖ ఈ సేవలను వేగంగా విస్తరించడానికి సిద్ధమైంది. గజ్వేల్ రేక్ పాయింట్‌కు ఎరువులే కాకుండా ఇతర వ్యవసాయ, వ్యాపారోత్పత్తులు తరలిస్తే ఇక్కడి నుంచి సిరిసిల్ల, జనగామ, సంగారెడ్డి, మెదక్, కరీంనగర్, మేడ్చల్ జిల్లాలకు తరలించే అవకాశమున్నందువల్ల మాల్‌గాడీకి మంచి గిరాకీ ఉంటుందని కూడా భావిస్తున్నారు. దీని ద్వారా రైల్వే శాఖ ఆదాయనికి గజ్వేల్ రేక్ పాయింట్ ప్రధాన ఆదాయ వనరుగా భవిష్యత్‌లో అవతరించనున్నదని కూడా ఆశిస్తున్నారు. ఇక్కడ గోదాముల నిర్మాణం ఇప్పటికే ఊపందుకుంది. కానీ సాధారణ రైళ్లను నడపటంపై నిర్లక్ష్యం ప్రదర్శించడం విమర్శలకు దారి తీస్తోంది. ఇదే క్రమంలోనే తాజాగా మంత్రి హరీశ్‌రావు మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలిసి దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్‌తో కలిసి ప్యాసింజర్ రైలు సేవలను ప్రారంభించే అంశంపై చర్చించారు. ఈ క్రమంలోనే దుద్దెడ నుంచి సిద్దిపేట వరకు సుమారు 10 కిలోమీటర్ల ట్రయల్‌రన్‌ను ఈనెల 15న నిర్వహించి, ఆ తర్వాత ప్యాసింజర్ రైలు సేవలను ప్రారంభించే అవకాశం కనిపిస్తోంది.

క్లుప్తంగా

విద్యతోనే సమూల మార్పులు


బ్యాగులు పంపిణీ చేస్తున్న శ్రీనిధి

ములుగు(గజ్వేల్): విద్య ద్వారా ప్రజల జీవితాల్లో సమూల మార్పులు వస్తాయని ములుగు అటవీ కళాశాల, పరిశోధన సంస్థ (ఎఫ్‌సీఆర్ఐ) అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎన్.ఎస్ శ్రీనిధి పేర్కొన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా మండలంలోని అచ్చాయిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం ఉచితంగా బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పకుండా బడికి పంపించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి హెచ్ఎమ్ జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీస్ వాహనాల విడిభాగాల వేలం

సిద్దిపేటకమాన్: కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీసు స్టేషన్‌లలో డ్యామేజ్ అయిన వివిధ రకాల విడిభాగాలు, పోలీసు వాహనాల టైర్లు, బ్యాటరీలు ఈ నెల 12వ తేదీన పట్టణంలోని సీఏఆర్ హెడ్ క్వార్టర్‌లో వేలం వేయనున్నట్లు సీపీ శ్వేత తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. దీనికోసం కమిటీ చైర్మన్‌గా అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్‌చంద్రబోస్, కమిటీ మెంబర్లుగా సిద్దిపేట ఏసీపీ సురేందర్‌రెడ్డి, ఆర్ఐ ధరణికుమార్‌లను నియమించినట్లు తెలిపారు. ఆసక్తి గలవారు తమ పేర్లు నమోదు చేసుకుని వేలంలో పాల్గొనాలని చెప్పారు. మరిన్ని వివరాలకు ఆర్ఎస్ఐ సాయిప్రసాద్ 8978792606 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మేతకు వెళ్లి 15 మేకలు మృతి


మృతి చెందిన మేకల వద్ద రోదిస్తున్న ఓదయ్య

హుస్నాబాద్‌రూరల్: మేతకు వెళ్లిన మేకలు పొలాల గట్ల పై మృత్యువాత పడిన ఘటన శుక్రవారం హుస్నాబాద్ మండలం రాముల పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మర్రి ఓదయ్య గొర్రెలు, మేకల పెంపకంతో జీవనం సాగిస్తున్నాడు. రోజులాగే శుక్రవారం మధ్యాహ్నం గొర్రెలు, మేకలను మడద వైపు మేతకు తోలుకుపోయాడు. 30 మేకలు పొలాల గట్ల వైపు మేతకు వెళ్లాయి. అటువైపు వెళ్లిన 5 నిమిషాల్లోనే 15 మేకలు మృత్యువాత పడ్డాయి. అవి ఎలా చనిపోయాయో అంతు చిక్కడం లేదని ఓదయ్య వాపోయాడు. మిగిలిన మేకలను వైద్యులకు చూపించి చికిత్స చేయించినట్లు చెప్పారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని సర్పంచ్ గంగము మదన్‌మోహన్‌రెడ్డి కోరారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం వెలికితీత


రాములు(ఫైల్)

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట భూంపల్లి మండలం కూడవెల్లి వాగులో చేపల వేటకు వెళ్లి గల్లంతైన వ్యక్తి మృత దేహాన్ని శుక్రవారం బయటకు తీశారు. ఎస్ఐ భువనేశ్వర్‌రావు తెలిపిన వివరాలు.. పిట్ల రాములు(55) ఈనెల 6న మధ్యాహ్నం కూడవెల్లి వాగులోకి చేపలు పట్టడానికి వెళ్లాడు. థర్మకోల్ తెప్పపై కూర్చొని చేపలు పడుతుండగా వరద ఉధృతి పెరిగి వాగులో పడిపోయాడు. అదే గ్రామానికి చెందిన బారెల్లి రాజు గమనించి రాములు కుటుంబ సభ్యులకు తెలిపాడు. మూడు రోజులుగా గాలించగా శుక్రవారం వాగు ఒడ్డున మృతదేహం కనిపించింది. బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని భార్య బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆరోగ్యమే లక్ష్యంగా..

- జిల్లాలో కొనసాగుతున్న పోషణ మాసోత్సవాలు
- గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య స్థితిపై పరిశీలన
- పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు చర్యలు


అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల బరువును చెక్ చేస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ, సిబ్బంది

పటాన్‌చెరు టౌన్: మాతా, శిశు సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పోషణ మాసోత్సవాలకు శ్రీకారం చుట్టింది. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ మొదటి వారం నుంచి చివరి వారం వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని సామాన్య, మధ్యతరగతి కుటుంబాల గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారం, చిన్నారుల ఆరోగ్య పరిస్థితులపై అధికారులు, ఐసీడీఎస్ సిబ్బంది అవగాహన కల్పిస్తారు. అదేవిధంగా జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు అన్న ప్రాసన, అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతాలు కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రస్తుతం జిల్లాలో పోషణ మాసోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సెప్టెంబర్ నెల మొత్తం నిర్వహించే కార్యక్రమాల వివరాలు.

మొదటివారం:

చిన్నారుల బరువు, జబ్బ చుట్టూ కొలత తీసుకోవడం.. కొలతల వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయడం. పిల్లల పెరుగుదల పర్యవేక్షణ ఎస్‌హెచ్‌టీపీస్‌లో నమోదు చేస్తారు. అదేవిధంగా పోషణ ట్రాకర్ లో వివరాలను నమోదు చేస్తారు. చిన్నారులకు టీకాలు, గర్భిణులకు ఆస్పత్రిలో చెకప్ చేయిస్తారు. పోషకాహార పద్ధతులపై అవగాహన కల్పిస్తారు. అనుబంధ పోషకాహార కార్యక్రమం టెక్ హోమ్, ఐరన్, కాల్షియం మాత్రలు సరఫరా చేస్తారు. సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

రెండో వారం:

చిన్నారుల బరువులు చూడటం, పోషకాహారానికి పెరటి తోటల పెంపకం ప్రారంభం. విటమిన్- సి అధికంగా ఉండే పండ్ల మొక్కల పెంపకం వంటి చేయాలి. అంగన్‌వాడీ పరిధిలో ఐదేళ్లలోపు పిల్లలందరి పెరుగుదల పర్యవేక్షణ చేయాలి. గర్భిణుల నమోదు, అన్నప్రాసన, అక్షరాభ్యాసం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. కిశోర బాలికలకు రక్త పరీక్షలు చేయడం, ఆరోగ్య పోషకాహార ఆవశ్యకత పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

మూడో వారం:

చిన్నారులకు టీకాలు, గర్భిణుల బరువు చూడటం, పరీక్షలు చేయించడం చేస్తారు. పోషకాహారం, తల్లి పాల ఆవశ్యకత పై అవగాహన కల్పించడం, గర్భిణుల నమోదు వంటి కార్యక్రమాలు నిర్వహించాలి. ర్యాలీలు, అవగాహన సమావేశాలు ఏర్పాటు చేయడం, పరిశుభ్రత వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు.

నాలుగో వారం:

పోషకాహారం తీసుకునేందుకు శుభ్రత పాటించడం, ఇతర విద్యార్థులను ప్రోత్సహించడం వంటివి చేయాలి. ఉదయం ప్రార్థనలో పోషకాహారం పై రోజువారి సందేశాలు ఇవ్వడం, వ్యాస రచన పోటీలు, చేతులు శుభ్రతపై ప్రదర్శనలు చేస్తారు.

ఐసీడీఎస్ ప్రాజెక్టుల వివరాలు...

సంగారెడ్డి జిల్లాలో పటాన్‌చెరు, జహీరాబాద్, నారాయణఖేడ్, సదాశివపేట, జోగిపేట్ ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి.

జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు	: 5
అంగన్‌వాడీ కేంద్రాలు	: 1,504
ఆరేళ్లలోపు చిన్నారులు	: 99,634
గర్భిణులు	: 11,698
బాలింతలు	: 6,851

ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం



సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా పోషణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నాం. షెడ్యూల్ ప్రకారం అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యక్రమాలు నిర్వహణకు కార్యాచరణ రూపొందించి, పోషకాహార విలువలపై ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నాం. ఎత్తు, బరువు తక్కువున్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. పోషణ మాసోత్సవాలను ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్నారు. పిల్లల ఎదుగుదలపై శ్రద్ధ, చిన్నారుల తల్లిదండ్రులకు పౌష్టికాహారం పై అవగాహన కల్పిస్తున్నాం. చిన్నారుల్లో పోషణ లోపం లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– సంధ్యారాణి, జిల్లా సంక్షేమ అధికారి

సోషల్ టీచర్.. తెలుగులో మేటి

- తానా అంతర్జాతీయ కవిసమ్మేళనానికి ఆహ్వానం
- వేలూరు టీచర్ రాధకు దక్కిన అవకాశం


పురస్కారంతో ఉపాధ్యాయురాలు రాధ

వర్గల్(గజ్వేల్): ఆమె తెలుగు భాషోపాధ్యాయురాలు కాదు. కానీ తెలుగు భాషపై మక్కువ ఆమెను తానా అంతర్జాతీయ కవిసమ్మేళనంలో పాల్గొనే అవకాశం కల్పించింది. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం వేలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో చొప్పదండి రాధ సోషల్ టీచర్. ఆ పాఠాలు చెబుతూనే వీలు దొరికినపుడల్లా తెలుగు కవితలు రాయడం, పుస్తక రచన, సాహితీ గోష్ఠులలో చురుకుగా పాల్గొనడం ఆమె వ్యాపకంగా మారాయి. ఆమె అభిరుచి గుర్తించిన ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) ప్రపంచ సాహిత్యవేదిక ఈ నెల 9న కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ తెలంగాణ భాషాదినోత్సవ కవిసమ్మేళనానికి ప్రత్యేక అతిథిగా ఆమెను ఆహ్వానించింది. శనివారం ఆమె ఈ సమ్మేళనంలో భాగస్వామికానున్నారు.

తెలుగు భాష అంటే ఎంతో ఇష్టం: చొప్పదండి రాధ, సోషల్ టీచర్

నాకు చిన్ననాటి నుంచి తెలుగు భాష అంటే ఎంతో ఇష్టం. అదే మక్కువతో ఎం.ఏ(తెలుగు) పోస్టుగాడ్యుయేషన్ చేశా. ప్రభుత్వ పాఠశాలలో సోషల్ టీచర్‌నే అయినా తెలుగు మీద మక్కువ వీడలేదు. వెలుగు రేఖలు(కవితాసంపుటి), కొత్తూరు కోవెల పుస్తక రచన, మనసు పలికిన వేళ (కవితా సంపుటి) రాశాను. ఇటీవల తెలుగు వెలుగు జాతీయ సాహిత్యవేదిక, ఎస్వీ ఫౌండేషన్ పటాన్‌చెరులో నిర్వహించిన జాతీయ సాహిత్య సంబరాలలో జాతీయ సాహిత్య పురస్కారం లభించింది. మండల స్థాయిలో బెస్ట్ టీచర్ అవార్డు పొందా. సాహితీసేవలకు గాను ఇటీవల హోలీ స్పిరిట్ క్రిస్టియన్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. తానా అంతర్జాతీయ సమ్మేళనంలో నాకు ప్రత్యేక ఆహ్వానం అందడం ఎంతో సంతోషం ఉంది.

గద్దర్ జీవితం స్ఫూర్తిదాయకం

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


గద్దర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: తొలి, మలిదశ తెలంగాణ పోరాటంలో కీలక భూమిక పోషించడంతో పాటు తన పాటలతో సబ్బండ వర్గాలను ఏకం చేసిన గద్దర్ జీవితం స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని బస్టాండ్ సమీపంలో రూ.30లక్షల సొంత నిధులతో ఏర్పాటు చేయనున్న 11 అడుగుల గద్దర్ కాంస్య విగ్రహ ఏర్పాటుకు శుక్రవారం శాసనమండలి మాజీ చైర్మన్ భూపాల్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ కోసం తన పాటలతో ప్రజల్లో స్వరాష్ట్ర చైతన్యాన్ని రగిలించిన గద్దర్ ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, ఎంపీపీ సుష్మాశ్రీ, జెడ్పీటీసీ సుప్రజ, కార్పొరేటర్ కుమార్‌యాదవ్, ఆత్మకమిటీ చైర్మన్ కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాండు, మాజీ కార్పొరేటర్ అంజయ్య, దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

తెలంగాణలోనే మైనార్టీలకు భద్రత

- అన్ని వర్గాలకు సీఎం కేసీఆర్ ప్రాధాన్యత
- ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు


బీఆర్ఎస్‌లో చేరుతున్న మైనార్టీ నేతలు

సిద్దిపేటజోన్: తెలంగాణలో మాత్రమే మైనార్టీలకు పూర్తి స్థాయి భద్రత ఉందని, బీజేపీ పాలిత ప్రాంతాల్లో కంటినిండా నిద్రపోలేని పరిస్థితులు నెలకొన్నాయని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని తన నివాసంలో బీజేపీ సిద్దిపేట జిల్లా మైనార్టీ మోర్చా అధ్యక్షుడు మహ్మద్ నయీమొద్దీన్, జిల్లా మైనార్టీ ప్రధాన కార్యదర్శి ఖలీల్, బీజేపీ జిల్లా మైనార్టీ మహిళా మోర్చా అధ్యక్షురాలు ఫర్హానా బేగం తదితరులు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ రాష్ట్రంలో మత కల్లోలాలు లేకుండా శాంతి భద్రతలు నెలకొల్పారని తెలిపారు. అన్ని వర్గాలను కాపాడుకునే, అన్ని మతాలను గౌరవించే నాయకుడు సీఎం కేసీఆర్ అని అభివర్ణించారు. అన్ని పండగలను ప్రభుత్వం గౌరవించే సంస్కృతి ఇక్కడే ఉందన్నారు. దేశంలో మైనార్టీల విద్య కోసం ఎంత ఖర్చు చేస్తున్నారో అంత ఒక్క తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెచ్చించినట్టు పేర్కొన్నారు. ముస్లింల కోసం అజ్మీర్ దర్గాలో తెలంగాణ హౌజ్ కట్టిస్తున్నట్టు పేర్కొన్నారు. అంతకుముందు పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. మైనార్టీ, ముస్లిం రక్షణ బీఆర్ఎస్ తోనే సాధ్యమని పేర్కొన్నారు. మంత్రి హరీశ్ రావు నాయకత్వంలో పార్టీ కోసం పనిచేస్తామని పేర్కొన్నారు. దుబ్బాక, సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని బీజేపీ మైనార్టీ ప్రతినిధులు ఒకే తాటిమీద వచ్చి రాజీనామా చేసి బీఆర్ఎస్ లో చేరుతునట్టు పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారు పట్టణ మైనార్టీ అధ్యక్షుడు యాసిన్ హుస్సన్‌తో పాటు వందలాది మంది మైనార్టీలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేథో సంపత్తి హక్కులకు ప్రాధాన్యం

కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ నీరజప్రభాకర్


సదస్సులో జ్యోతిప్రజ్వలన చేస్తున్న వీసీ నీరజప్రభాకర్

ములుగు(గజ్వేల్): భవిష్యత్‌లో ప్రతి అంశంలో మేథో సంపత్తి హక్కుల ప్రమేయం ఉంటుందని, వాటి పరిరక్షణకు పరిశోధకులు, ప్రొఫెసర్లు సిద్ధం కావాలని ములుగు కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ బి.నీరజప్రభాకర్ సూచించారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఉద్యాన విశ్వవిద్యాలయం, మేథో సంపత్తి హక్కుల విభాగం సంయుక్తంగా నిర్వహించిన మేథో హక్కుల పాత్రపై జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ఉద్యాన రంగంలో సైతం మేథో సంపత్తి హక్కులకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో భౌగోళిక గుర్తింపునకు అర్హత ఉన్న పలు ఉద్యాన పంటలపై సర్వేలు, పరిశోధనలు నిర్వహిస్తున్నామని, గణాంకాలు సేకరిస్తున్నామన్నారు. త్వరలోనే వాటికి భౌగోళిక గుర్తింపు రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేస్తామని వీసీ నీరజప్రభాకర్ తెలిపారు. ప్రముఖ న్యాయవాది సుభాజిత్ సాహా మాట్లాడుతూ భౌగోళిక గుర్తింపు పొందిన పంటల ఉత్పత్తిదారులు ఆ లోగోను తమ ఉత్పత్తులపై ముద్రించుకుని ఎగుమతులపై దృష్టి సారించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో మేథోసంపత్తి హక్కులకు అర్హత కలిగిన అనేక ఉత్పత్తులు పుష్కలంగా ఉన్నాయన్నారు. విశ్వవిద్యాలయ హార్టికల్చర్ డీన్ డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ మేథో సంపత్తి హక్కుల సంఖ్య ఒక సంస్థ పనితనానికి కొలమానంగా పరిగణించ బడుతాయని తెలిపారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ పీజీ డీన్ రాజశేఖర్, మేథా సంపత్తి హక్కుల పరిరక్షణ విభాగం నోడల్ అధికారి సైదయ్య, కళాశాల అసోసియేట్ డీన్ లక్ష్మీనారాయణ, ప్రొఫెసర్లు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


తాళం వేశారు.. సీలు మరిచారు


హుండీ తాళానికి వేయని సీలు

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల దుర్గాభవాని రాజగోపురంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక హుండీకి తాళం వేసిన ఆలయ సిబ్బంది... సీలు వేయడం మరిచారు. దీంతో తాళం తీసి విలువైన కానుకలు, నగదు తస్కరించే అవకాశం ఉందని భక్తులు ఆరోపిస్తున్నారు. కొన్ని రోజులుగా ఏడుపాయల ఆలయ అవినీతిపై వస్తున్న కథనాలు దుమారం లేపుతున్న సమయంలో హుండీకి సీలు వేయక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మంజీర నదికి వరదలు రావడంతో ఆలయాన్ని మూసేసి, రాజగోపురంలో తాత్కాలిక ఉత్సవ విగ్రహాన్ని, హుండీని ఏర్పాటు చేసిన విషయం విదితమే.

అనాథలకు అండగా 'శిశుగృహ'

- సిద్దిపేట జిల్లాలో త్వరలో ప్రారంభానికి సన్నాహాలు
- 10 మంది చిన్నారులకు ఆశ్రయం కల్పించే విధంగా ఏర్పాట్లు
- సిబ్బంది నియామకం పూర్తి
- దత్తత కోసం 410 మంది దంపతుల దరఖాస్తు


శిశు గృహలో చిన్నారులు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన ఆట వస్తువులు

సాక్షి, సిద్దిపేట: రాష్ట్ర ఆర్థిక వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు ప్రత్యేక చొరవతో జిల్లాకు శిశు గృహ మంజూరైంది. అనాథలైన శిశువులు, తల్లిదండ్రులు వదిలేసిన చిన్నారులను అక్కున చేర్చుకుని.. వారి ఆలనా పాలన ఇక్కడే చూడనున్నారు. పిల్లలు లేని వారికి ఇక్కడి నుంచే దత్తత ఇవ్వనున్నారు. సిద్దిపేట పట్టణంలో బాలసదనం భవనంలో శిశు గృహను ఏర్పాటు చేస్తున్నారు. దీనిని త్వరలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

10 మంది ఉండే విధంగా..

జిల్లాలో తల్లిదండ్రులను కోల్పోయిన శిశువులు, చిన్నారులను, వదిలేసిన చిన్నారులకు ఆశ్రయం కల్పించేందుకు చైల్డ్ లైన్ వారు సంగారెడ్డి, కరీంనగర్‌లకు తీసుకెళ్లి అప్పగించేవారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఇటీవల జిల్లాకు శిశుగృహను మంజూరు చేసింది. దీనిలో 10 మంది చిన్నారులకు ఆశ్రయం కల్పించే విధంగా సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. వదిలేసిన, వద్దనుకున్న, లభించిన చిన్నారులు 90 రోజుల పాటు వారి పర్యవేక్షణలో ఉండనున్నారు. తల్లిదండ్రులు మళ్లీ మనసు మార్చుకుని వస్తారేమో అని చూస్తారు. రాకపోతే ఆ చిన్నారులను దత్తతకు ఇస్తారు. ఈ శిశుగృహ జిల్లా సంక్షేమ శాఖ పరిధిలోని బాలల పరిరక్షణ విభాగం(డీసీపీయూ) ఆధ్వర్యంలో కొనసాగనుంది. శిశుగృహ ఆరేళ్లలోపు పిల్లలకు అండగా నిలువనుంది. జిల్లా ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటి వరకు నలుగురిని సంగారెడ్డి, ఒకరిని కరీంనగర్ శిశు గృహకు తరలించారు. ఇక్కడ శిశుగృహ అందుబాటులోకి వస్తే అంత దూరం వెళ్లాల్సిన అవసరం ఉండదు.

సిబ్బంది నియామకం

శిశుగృహలో పిల్లల సంరక్షణ కోసం సిబ్బందిని నియమించారు. మేనేజర్, సోషల్ వర్కర్, పార్ట్‌టైం డాక్టర్, నర్సు, ఆయాలు ఆరుగురు, వాచ్‌మెన్‌ల నియామకం పూర్తయింది. చిన్నారులు ఆడుకునే విధంగా ఆట వస్తువులను ఏర్పాటు చేశారు. 24 గంటలు పని చేస్తుంది. చిన్నారులను దత్తత ఇచ్చే వరకు కంటికి రెప్పలాగా కాపాడనున్నారు.

దత్తత కోసం 410 మంది దరఖాస్తు

'కారా' నిబంధనల ప్రకారం పిల్లలను దత్తత తీసుకునేందుకు జిల్లా వ్యాప్తంగా 410 మంది దంపతులు దరఖాస్తు చేసుకున్నారు. గతంలో దత్తత కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత సిద్దిపేటలో పరిశీలన పూర్తయిన తర్వాత సంగారెడ్డికి వెళ్లేవారు. అక్కడ ఎవరైనా చిన్నారులు ఉంటే 'కారా' నిబంధనల ప్రకారం దత్తతను తీసుకునే వారు. ఇప్పటి వరకు 24 మంది పిల్లలను దంపతులు దత్తత తీసుకున్నారు.

త్వరలో అందుబాటులోకి..



సిద్దిపేటలోని బాలసదనం ప్రాంగణంలో శిశు గృహ త్వరలో ప్రారంభం కానుంది. ఇందు కోసం ఏర్పాట్లు చేశాం. 10 మంది చిన్నారులు ఆశ్రయం పొందే విధంగా సౌకర్యాలు కల్పించాం. పిల్లలను దత్తతను ఇక సిద్దిపేట నుంచే ఇస్తాం.

– రాంగోపాల్‌రెడ్డి, డీడబ్ల్యూఓ

కొండముచ్చు దాడిలో విద్యార్థికి గాయం


బాలుడికి చికిత్స చేస్తున్న వైద్యులు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులపై కొండముచ్చు దాడి చేసింది. దీంతో రెండో తరగతి చదువుతున్న సుజిత్ తీవ్రంగా గాయపడ్డాడు. విద్యార్థిని సమీప ఆరోగ్య కేంద్రానికి తరలించారు. గాయానికి సుమారు 10 కుట్లు పడ్డాయని ఉపాధ్యాయులు తెలిపారు. పాఠశాలకు సరైన భద్రత లేకపోవడంతో కోతులు, కొండముచ్చులు దాడి చేస్తున్నాయని చెప్పారు.

పాము కాటుతో వ్యక్తి మృతి

దుబ్బాకరూరల్: పాముకాటుకు గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన అక్బర్‌పేట భూంపల్లి మండలం ఎనగుర్తి గ్రామంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు. ఎనగుర్తి బాబు(30) గత నెల 31న రాత్రి ఇంటి బయట ఉన్న ఇసుకలో నిద్రిస్తుండగా పాము కాటు వేసింది. మొదటిసారి కాటు వేసినప్పుడు ఎలుక అనుకొని అలాగే నిద్రించాడు. మెడపై మరోసారి కాటు వేయడంతో రక్తం రావడంతో లేచి చూసే సరికి పాము కనిపించింది. కర్రతో దాన్ని చంపేశారు. వెంటనే సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.

దొంగతనాలే వృత్తిగా..


మాట్లాడుతున్న డీఎస్పీ రమేష్ కుమార్


దొంగలించిన సొమ్ము

- వరుస చోరీలకు పాల్పడుతున్న కుటుంబం
- అరెస్ట్, రిమాండ్. బంగారం, నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రమేష్ కుమార్

సంగారెడ్డి మున్సిపాలిటీ: వరుస దొంగతనాలకు పాల్పడుతున్న భార్యాభర్తలతోపాటు వారి కొడుకును అరెస్టు చేసిన సంఘటన సంగారెడ్డి టౌన్ పీఎస్ పరిధిలో జరిగింది. శుక్రవారం డీఎస్పీ రమేశ్‌కుమార్ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. సంగారెడ్డి పట్టణం, రాజంపేటకు చెందిన మార్గ యాదగిరి జల్సాలకు అలవాటు పడి 19ఏళ్ల వయసులోనే దొంగతనాలు చేయడం మొదలు పెట్టాడు. 1999లో సంగారెడ్డిలో మొదటి దొంగతనం చేసి రెండేళ్ల జైలు శిక్ష అనుభవించాడు. వరుసగా దొంగతనాలకు పాల్పడుతుండటంతో 2001లో యాదగిరి పై కేడీ షీట్ ఓపెన్ చేశారు. అయినా అతనిలో మార్పు రాలేదు. 2020–21లో సుమారు 25 దొంగతనం కేసుల్లో జైలుకు వెళ్లాడు. జైలు నుంచి వచ్చిన తర్వాత భార్య, కొడుకులను సైతం దొంగతనాలకు అలవాటు చేశాడు. దొంగతనం చేసిన బంగారం ఇంటికి తీసుకువచ్చి భార్యకు ఇచ్చేవాడు. ఆమె వాటిని బంగారు షాపుల్లో అమ్మేది.

సంగారెడ్డి కొండాపూర్, హత్నూర పోలీస్ స్టేషన్ పరిధిలో 12 దొంగతనాలు చేసిన యాదగిరి కుటుంబం... ఆగస్టు 30న అయ్యప్ప కాలనీ రోడ్ నంబర్ – 1లో ఓ ఇంట్లోకి చోరీకి వెళ్లారు. బీరువాలోని బంగారు ఆభరణాలు, నగదు దొంగలించారు. ఈ 12 దొంగతనాల కేసుల్లో మార్గ యాదగిరి, అతని భార్య అనిత, కుమారుడిని అరెస్ట్ చేశారు. వారి నుంచి మొత్తం 63 తులాల బంగారం, 112 కిలోల వెండి, అయిదు వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన పోలీసు అధికారులను డీఎస్పీ అభినందించారు. సమావేశంలో సీఐ శ్రీధర్ రెడ్డి, ఎస్ఐలు, సీసీఎస్ అధికారులు ఉన్నారు.